క్లుప్తంగా

నేడు గోకవరంలో ఎమ్మెల్యే పర్యటన

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం స్థానిక గుబ్బాలమ్మ ఆలయం వద్ద జరిగే అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

నేడు ముర్రా గేదె దూడల ప్రదర్శన

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు పశువైద్యశాల వద్ద బుధవారం ముర్రా గేదె దూడల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు బిక్కవోలు పశు వైద్యాధికారి ప్రణీత్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ, డీఎల్‌డీఏ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనకు సంవత్సరం లోపు దూడలను రైతులు తీసుకు రావాలని కోరారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని తెలిపారు.

నేడు శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును అందిస్తారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పాలకవర్గం సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రాజానగరం: లాలాచెరువు శివారు ఆటోనగర్‌లో మంగళవారం ఆటో మొబైల్స్, ఇంజినీరింగ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా పిల్లా రామ్మోహన రావు, ఉపాధ్యక్షుడిగా గుబ్బల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బీఎల్‌పీ చౌదరి, సంయుక్త కార్యదర్శిగా అడపా శ్రీనివాసరావు, కోశాధికారిగా చింతలపూడి వీర్రాజు ఎన్నికయ్యారు. వీరితో పాటు కోఆప్షన్ సభ్యులను కూడా అసోసియేషన్‌తో పాటు అనుబంధంగా ఉన్న 9 యూనియన్ల సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆటోనగర్‌లో నెలకొన్న వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్యదర్శి గోల దేవేంద్రరావు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సేవకుల సదస్సు



నూతన కార్యవర్గ సభ్యులు

సీతానగరం: రఘుదేవపురం బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ యూసీఎఫ్–1 సేవకుల సదస్సు నిర్వహించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమానికి 40 మంది హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా కె.ప్రకాష్ బాబు, జనరల్ సెక్రటరీగా వై.రూబిన్ జాషువా, ట్రెజరర్‌గా ఎం.శామ్యూల్ కరుణాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా డి.జోసఫ్, జాయింట్ సెక్రటరీగా కె.రాజేష్ కుమార్, కన్వీనర్‌గా ఎస్.ప్రసన్నకుమార్, గౌరవ అధ్యక్షులుగా కె.జాన్ బాబూరావు, ఎస్.జోసఫ్ రాజు, సలహాదారులుగా డి.కృపమ్మ, ఆనంద కుమారి, డాక్టర్ రాజు, కె.ప్రసాద్‌బాబు ఎంపికయ్యారు.

సంఘ అధ్యక్షుడిగా గోపాలం

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురం మత్స్య సహకార సంఘం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కె.గోపాలం, కార్యదర్శిగా నత్తల సత్యనారాయణతో పాటు ఏడుగురు సభ్యులు ఎన్నికయ్యారు.

పోషణ పక్వాడతో అందరికీ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యామల

పెదపూడి: పోషణ పక్వాడ కార్యక్రమంతో అందరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామల అన్నారు. పుట్టకొండలో సంపర సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు, హెల్పర్లతో పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహన సదస్సు సర్పంచ్ వల్లు వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో ర్యాలీ నిర్వహించారు. వెల్‌బేబీ షో, సీమంతాలు చేశారు. డాక్టర్ శ్యామల మాట్లాడుతూ మార్చి 20 నుంచి ఏప్రిల్ 3 వరకు పోషణ పక్వాడ కార్యక్రమం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీల సంఘం నాయకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దిగుబడిపై కొండంత ఆశ

- మామిడి, జీడిమామిడి రైతుల ఎదురుచూపు
- వాతావరణ మార్పులతో ఆవేదన



బొల్లెద్దుపాలెంలో మామిడి తోటలు



కణుపూరులో జీడిమామిడి తోటలు

మధురపూడి: మెట్ట ప్రాంతమైన రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో మామిడి, జీడిమామిడి తోటలు రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయి. సన్నకారు రైతులకు ఆధారమైన వీటితో ఆర్థిక భరోసా ఏర్పడుతుంది. ఈ తోటల్లో ఎకరం విస్తీర్ణంలో సుమారు 60 నుంచి 80 చెట్లుంటాయి. రెండు నియోజకవర్గాల్లో 6,011.01 హెక్టార్లలో జీడిమామిడి, 3,624.29 హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. మెట్ట, కొండ ప్రాంతాలు అనువుగా ఉండటంతో జీడిమామిడి సాగుకు రైతులు ఆసక్తి చూపుతారు.

వాతావరణ మార్పులతో..

అకాల వర్షాలు, వాతావరణంలో మార్పుల కారణంగా పంట దిగుబడి తగ్గుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. తేనెమంచు విపరీతంగా ఉండటంతో పూత మాడిపోయింది. పిందె కట్టకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. జీడిమామిడిలో పిక్క దిగుబడి తగ్గిపోయింది. ఏజెన్సీ, ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఇది మరింతగా ఉంది. ఎక్కువ దిగుబడి వస్తోందని ఆశించిన తోటలకు సైతం పిక్క దిగుబడి తగ్గుతోందని రైతులు దిగాలు పడుతున్నారు. మామిడిలో బోరాన్ లోపం కారణంగా పిందె గిడసబారిపోయి రాలిపోతోంది. చాలా తోటల్లో కాయలు ఎదుగుదలకు నోచుకోకుండానే నేలరాలిపోతున్నాయి. ఇదిలా ఉండగా పంట దిగుబడి నిలబడిన తోటల్లో కాయలు నిమ్మపండు దశలో ఉన్నాయి. వీటిని పుచ్చు, పండీగలు ఆశిస్తున్నాయి. దీని కారణంగా కూడా కాయలు ఎదగకుండా, రాలిపోతున్నాయి.

ధర నిలబడాలని..

ధర పడిపోకుండా నిలబడాలని రైతులు ఆశిస్తున్నారు. మామిడి పచ్చికాయలు టన్ను రూ.18 వేల నుంచి రూ.25 వేలు ఉండాలని, పండ్లు టన్ను రూ.30 వేలు నుంచి రూ.40 వేలు ఉండాలని ఆశిస్తున్నారు. అలాగే జీడిమామిడి పిక్కలు 80 కేజీల బస్తా రూ.8,500 నుంచి రూ.10 వేలు ఉంటే తమకు బాగుంటుందంటున్నారు. తెగుళ్ల నివారణకు, పంట రక్షణకు మందులు చల్లడంలో ఉద్యానవనశాఖ అధికారుల సూచనలను పాటిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు లాభదాయకం



మామిడి, జీడిమామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే రైతాంగానికి లాభదాయకంగా ఉంటుంది. పేద వర్గాలకు చెందిన రైతులకు మామిడి, జీడిమామిడి ఉపాధిగా ఉంది. అలాగే జీడిపంట సాగు లాభదాయకంగా ఉంటుంది. అయితే అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులు కారణంగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. రైతులు మెళకువలు పాటించి దిగుబడి పెరగడానికి కృషి చేయాలి. పంటను ఆశిస్తున్న తెగుళ్లను అరికట్టడం ద్వారా దిగుబడిని పెంచవచ్చు.

– కోటా సుబ్రహ్మణ్యం, జీడిపిక్కల వ్యాపారి

తెగుళ్ల నివారణకు..



జీడిమామిడిలో వచ్చే వైరస్ తెగులు నివారణకు లాంబ్డా సైహాలోత్రిన్ 2.5 ఈసీ 600 ఎంఎల్‌ను ఎకరం విస్తీర్ణానికి పిచికారీ చేయాలి. అలాగే పది రోజుల వ్యవధిలో ఇమిడాక్లోప్రిడ్ మందును 500 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలి. మామిడిలో బోరాన్ లోపం కారణంగా రాలిపోతున్న పిందెలను నిలబెట్టుకోవడానికి 3 గ్రాముల బోరాన్ మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. మంగు తెగులు నివారణకు ఇమిడా లేదా ఫిప్రోనిల్ మందు 600 ఎంఎల్‌ను ఎకరానికి పిచికారీ చేయాలి. తేనెమంచు ఉధృతి నివారణకు క్లోరో సైలిఫాస్ 600 ఎంఎల్ ఎకరానికి చల్లడం ద్వారా పంటను సంరక్షించుకోవచ్చు.

– రిని, ఉద్యానవనశాఖాధికారి, కోరుకొండ

నేడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పర్యటన

రాజానగరం: స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం ఉదయం 11.30 గంటలకు రాజానగరంలో జరిగే మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారు. అన్నదాన సత్రం ప్రాంతంలోని కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమం అనంతరం 104 వాహనాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటకు రాజమహేంద్రవరం – చిన కొండేపూడి మధ్య జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలిస్తారు. 3.30 గంటలకు లాలా చెరువు హెచ్‌బీ కాలనీ అభివృద్ధిపై ప్రకాశం నగర్‌లోని తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. తదుపరి కోరుకొండ మండలానికి సంబంధించిన ఐసీడీఎస్ అధికారులతో సమావేశమవుతారు. సాయంత్రం 6 గంటలకు బొమ్మూరులోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి పెండింగ్‌లో ఉన్న నివాస స్థలాల పంపిణీపై కలెక్టర్‌తో చర్చిస్తారు.

ఇంటర్ పరీక్షలకు 35 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ పేపర్–1, కామర్స్ పేపర్–1 నిర్వహించారు. జూనియర్ కళాశాల కేంద్రంలో 267 మంది హాజరు కావాల్సి ఉండగా 248 మంది, జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 265 మందికి 252 మంది హాజరు కాలేదు. మొత్తం 35 మంది పరీక్షకు రాలేదని చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్‌ఏ శిరీష తెలిపారు.

మాట నిలబెట్టుకునే సీఎం జగన్



ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా అందించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పందలపాక సచివాలయం వద్ద మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అక్కచెల్లెమ్మల ఆత్మ గౌరవం మరింత పెంచేందుకు డ్వాకా రుణాల బకాయిలను చెల్లించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మూడో విడత కూడా పంపిణీ చేశారని తెలిపారు. ఆనాడు చంద్రబాబు డ్వాక్రా, రైతు రుణాలను మాఫీ చేస్తానని చెప్పి, అమలు చేయలేదని గుర్తు చేశారు. మాట ఇచ్చి తప్పిన వ్యక్తి చంద్రబాబు అయితే ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేసిన వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను రద్దు చేస్తామని టీడీపీ నాయకులు చెబుతున్నారని, వారికే వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. బిక్కవోలు మండలంలోని 1,523 సంఘాలకు రూ.14.39 కోట్లు ఆసరా మూడవ విడతగా జమ అయింది అన్నారు. పందలపాకలో మహిళా కళాశాల ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలను రూ.1.60 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. గ్రామంలో రూ.2.80 కోట్లతో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సర్పంచ్ సబ్బారపు పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ కర్రి గీతా సావిత్రి, మచ్చాపాప, తేతలి సుమ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ బోడ్డు ముత్యాలరావు పాల్గొన్నారు.

ప్రజాసాధికారతే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



మహాలక్ష్మిపేటలో మహిళకు పథకాల కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజాసాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం–5 పరిధిలో గల మహాలక్ష్మిపేట, శివాలయం వీధి ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందజేసి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి దానికి సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. స్థానిక సమస్యల పరిష్కారంపై అధికారులకు ఆదేశాలిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న చేస్తున్న మేలు ఎప్పటికీ మరువలేమని, అడగకుండానే అండగా నిలుస్తున్న జగనన్నకు అండగా ఉంటూ ఆయన రుణం తీర్చుకుంటామని ఆయా ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేకు మాట ఇచ్చారు. మహాలక్ష్మిపేటలో జెడ్పీ నిధులు రూ.17.40 లక్షలతో నిర్మించిన ఇంటర్నల్ సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



క్విజ్ విజేతలకు బహుమతులు అందిస్తున్న సోమన్న చౌదరి, తదితరులు

బిక్కవోలు: ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి సూచించారు. మంగళవారం ఇళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన విద్యార్థుల ప్రేరణ–ప్రోత్సాహం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలపై క్విజ్ నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం సీతామహాలక్ష్మి, మర్రిపూడి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వీరబాబు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మధురపూడి: పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ కుశలవ దొర తెలిపారు. కోరుకొండ హైస్కూల్లో పరీక్షా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 1,254 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వీరికోసం ఐదు కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏ, బి కేంద్రాలతో పాటు, దోసకాయలపల్లి, కోరుకొండలోని చెరుకూరి ప్రైవేటు స్కూల్, శ్రీరంగపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సెంటర్లు నిర్వహిస్తున్నామన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



జి.మామిడాడలో ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకాంక్ష అని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ, గండ్రేడు గ్రామాల్లో సర్పంచులు లంక మున్ని, కుడిపూడి మాధవీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధి చెక్కులను ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. తులసి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళ సాధికారత దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. జగనన్న మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని, అందుకు మహిళలంతా మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో రూ.30,40,171 ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి వెంకటరెడ్డి, ఏపీఎం చినబాబు, సీసీలు పుష్పలత, శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

భూగర్భ జలాల రక్షణ సమష్టి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: భూగర్భ జలాల రక్షణ సమష్టి బాధ్యత అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. నేషనల్ హైడ్రోలజీ ప్రాజెక్టులో భాగంగా గ్రౌండ్ వాటర్ మానటరింగ్ అండ్ సైనబుల్ డెవలప్‌మెంట్ ఆఫ్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ ఇన్ ఈస్ట్‌గోదావరి డిస్ట్రిక్ట్ అనే అంశంపై యూనివర్సిటీలోని సెమినార్ హాల్లో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ పూర్వం నదులు, బావులలోని నీటిని నేరుగా తాగేవారమని, ప్రస్తుత కాలుష్య వాతావరణంలో ఆ పరిస్థితి లేక నీటిని కొనుక్కుని తాగుతున్నామన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ప్రోజెక్టు డైరెక్టర్ రామ్‌గోపాల్ మాట్లాడుతూ జలశక్తి అభియాన్ పథకంలో భాగంగా జిల్లాలో భూగర్భ జలసంరక్షణ కట్టడాలు నిర్మిస్తున్నామన్నారు. భూగర్భ జలాల పరిరక్షణను విద్యార్థులు అవగాహన చేసుకుని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పరిస్థితులను మరింతగా మెరుగుపర్చాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ ఎస్.మాధవరావు మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటాలని సూచించారు. భూగర్భ జలశాఖ, డ్వామా, వ్యవసాయశాఖ, జియో సైన్సెస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోని ప్రధాన అంశంపై హైడ్రోజియాలజిస్టు డి.లక్ష్మీ ప్రత్యూష పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. వై.శ్రీనివాస్ కన్వీనర్‌గా వ్యవహరించగా, ఏపీడీ శ్రీనివాసరావు, హైడ్రోలజిస్టు ఎం.శివరామకృష్ణ, జియోఫిజిస్టు జి.రాధాకృష్ణ, హెచ్ఓడీ డాక్టర్ కేవీ స్వామి పాల్గొన్నారు.

శ్రీరంగపట్నం హైస్కూలు విద్యార్థుల ప్రతిభ



ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులు

మధురపూడి: శ్రీరంగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో విజయం సాధించారు. తుమ్మల నాగసాయిదుర్గ, బొడ్డేటి శివసాయిశ్రీ, కాయిదాల దివ్య, ఐకి లక్ష్మి మేఘనశ్రీ, సూరిశెట్టి నాగ సతీష్, అతికింశెట్టి విష్ణు చిన్నారావు సత్తా చాటారు. వీరికి ప్రతి ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వ అందిస్తుంది. ఆ విద్యార్థులను, ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఉపాధ్యాయుడు రామారావును శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల అమ్మాజీ రమణ, పీఎంపీ చైర్మన్ గుత్తి రాము, వైస్ ఎంపీపీ కాయిదాల నానాజీ, నరసింహారెడ్డి అభినందించారు.

మురుగునీటితో అవస్థలు



మునికూడలిలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

సీతానగరం: మునికూడలి జగ్జీవన్‌రామ్ కాలనీలో డ్రైనేజీల నుంచి మురుగునీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు ముందుకు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో ఇళ్లలోకి చేరుతోందని కొల్లి చిరంజీవి, కొల్లి బుజ్జమ్మ, కొడమంచిలి శాంతి, కుమారి, అరవాలు, కొల్లి ఏసు, బుంగ భూషణం తెలిపారు. నాలుగు రోడ్ల విస్తరణ పనులతో మెయిన్ డ్రైనేజీ పూడికుపోయిందని, అయితే ఓసీ ఏరియాలో కాలువగా తీశారని, దీనికి కలుపుతూ నీరు తరలివెళ్లడానికి కాలువగా తీయాలని కోరారు. పంచాయతీ వాటర్ ట్యాంక్ గేట్‌వాల్ పని చేయడం లేదని, దాని నుంచి నీరు ఇదే డ్రైనేజీలోకి చేరడంతో నీరు ఇళ్లలోకి వెళుతోందన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావొచ్చు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావొచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన తమ మిత్రుడు సందీప్ జ్ఞాపకార్థంగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదాతలకు రాజమహేంద్రవరంలోని సంజీవని బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు ధృవీకరణ పత్రాలు, బ్లడ్ గ్రూప్‌ని తెలియజేసే విధంగా ఉన్న కీచైన్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరావు, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఈసీ మెంబర్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, ఆచార్య కె.రమణేశ్వరి, ఎన్ఎస్ఎస్ పీఓలు ఎం.శిరీషా, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సీతానగరం: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో కార్పొరేట్లకు తప్ప, ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ విమర్శించారు. ఏప్రిల్ 5న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను మంగళవారం బొబ్బిల్లంకలో మండల సీఐటీయూ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు లోవ, సుబ్బలక్ష్మి మాట్లాడుతూ కేంద్రం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి, కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు.

ఆకట్టుకున్న హరికథ

రంగంపేట: స్థానిక గోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరిస్తున్నాయి. సోమవారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన ఎం.పూర్ణ భాగవతారిణి బృందం ప్రదర్శించిన బ్రహ్మంగారి కాలజ్ఞానం హరికథ ఆకట్టుకుంది. అంతకుముందు వీరబ్రహ్మేంద్రస్వామిని పలువురు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పాఠశాల, ఆలయాల అభివృద్ధికి రూ.3.25 లక్షల విరాళం



కరకుదురు పాఠశాలలో కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న త్రిమూర్తులు

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని రాజమహేంద్రవరంలో గల హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, సర్పంచ్ వుండ్రు చంద్రకళ అన్నారు. కరకుదురు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి తలాటం మురళి (హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు) రూ.1.25 లక్షల విలువ గల కంప్యూటర్, ప్రింటర్, ఇతర విద్యాసామగ్రి, గ్రామంలో రామాలయం అభివృద్ధికి రూ.లక్ష, దుర్గాదేవి ఆలయ అభివృద్ధికి మరో రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఆ విరాళం మంగళవారం మురళి మేనమామ పాటంశెట్టి త్రిమూర్తులు చేతుల మీదుగా సర్పంచ్ చంద్రకళ, సత్యనారాయణ, హెచ్ఎం కమలారాణికి, ఆలయాల కమిటీల ప్రతినిధులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి వాసంశెట్టి మాధవ పాల్గొన్నారు.

జేసీ విచారణ సమగ్రంగా చేపట్టాలి

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో సుందరమ్మ సత్రానికి సంబంధించిన 89 ఎకరాల భూమిపై జేసీ సమగ్ర విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన రంపయర్రంపాలెం గ్రామంలో ఆయన మాట్లాడుతూ సత్రం భూముల విషయంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయగా ఈనెల 29న జాయింట్ కలెక్టర్ విచారణ నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఈ విచారణను న్యాయబద్ధంగా జరిగితే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అనపర్తి: గంజాయి విక్రయానికి పాల్పడుతున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 24 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. మంగళవారం స్థానిక పాతవూరు బాపనమ్మ గుడి సమీపంలో గల పుంత రోడ్డులో గంజాయిని వాటాలు వేసుకుంటున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకునిగంజాయి, బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం జరిపిన విచారణలో అనపర్తికి చెందిన శివకోటి సురేష్‌కుమార్, అడబాల వెంకటదుర్గారావు, సమ్మంగి హరేంద్ర, దుక్కా వీరబాబు మన్యం నుంచి గంజాయిని తెచ్చుకుని అనపర్తిలో విక్రయాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.